క్లుప్తంగా

వెటర్నరీ ఆఫీసర్‌గా డాక్టర్ నాగేంద్రరెడ్డి



తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ వెటర్నరీ ఆఫీసర్‌గా ఎం.నాగేంద్రరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరితను కలిశారు. వెదురుకుప్పం మండలంలో వెటర్నరీ డాక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



పాకాల : మండలంలోని పెద్దరామాపురం పంచాయతీలో కొత్తగా పెన్షన్ పొందిన లబ్ధిదారులు శుక్రవారం సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పింఛను రాలేదని వాపోయారు.

పచ్చ పత్రిక విష జ్వరం

- రాయలపురం సర్పంచ్ వెంకటయ్య ఆగ్రహం



మాట్లాడుతున్న వృద్ధురాలు నాగమ్మ



సర్పంచ్ వెంకటయ్య

చంద్రగిరి: తప్పుడు కథనాలు ప్రచురించి పల్లెల్లో చిచ్చు రేపేందుకు ఎల్లో మీడియా ప్రయత్నిస్తోందని రాయలపురం సర్పంచ్ వెంకటయ్య మండిపడ్డారు. ఆయన శుక్రవారం ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. ఈనాడు దినపత్రికలో శుక్రవారం రాయలపురం పంచాయతీ వెంకటంపేటలో పారిశుద్ధ్యం లోపించి దోమలు.. ఊరంతా జ్వరాలు అని కథనం ప్రచురితమైంది. వాస్తవానికి రాయలపురంలో 15 రోజుల క్రితం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శాశ్వత పరిష్కారం కోసం కాలువ నిర్మాణాలకు రూ.40 లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు. గ్రామంలో దోమల వల్ల జ్వరాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీనిపై సర్పంచ్ మాట్లాడుతూ రాజకీయ లబ్ధికోసం తప్పుడు కథనాలు రాసి పల్లెల్లో చిచ్చుపెట్టొద్దని హితవుపలికారు.

చెట్టు కింద సేదతీరుతుంటే ఫొటో తీశారు

పచ్చ పత్రికలో వచ్చిన వార్తపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. రాయలపురానికి చెందిన నాగమ్మను విచారించారు. ఆమె మాట్లాడుతూ తాను ఎండ వేడికి తట్టుకోలేక చెట్టు కింద సేదతీరుతా ఉంటే ఎవరో ఒకాయన వచ్చాడని తెలిపారు. నిద్రపోతున్న తనను లేపి దోమల గురించి అడిగాడని, ఇక్కడ అంతా సవ్యంగా ఉందని, ఊర్లో ఎవరికీ జ్వరాలు లేవని చెప్పినట్టు వెల్లడించారు. అనంతరం ఆయనే పడుకోమని చెప్పి ఫొటో తీసుకుపోయాడని తెలిపారు. తాను ఆరోగ్యంగా ఉంటే వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నానని పత్రికలో వచ్చిందని, అబద్ధాల రాతలు ఎందుకు రాస్తారంటూ నాగమ్మ మండిపడ్డారు.

శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది

తిరుమల : పాదయాత్ర ముగించి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలంగాణ కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క తెలిపారు. ఆయన శుక్రవారం ఉదయం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. తమ రాష్ట్రంలో పెద్ద ఎత్తున లక్షల మందితో పాదయాత్ర చేశానన్నారు. నాలుగు మాసాలు తనతో పాటు పాదయాత్ర చేసిన వారితో కలసి స్వామి వారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

- వినాయక నిమజ్జనానికి టీటీడీ సంపూర్ణ సహకారం
- సెప్టెంబర్ 22న గరుడసేవ రోజు నిమజ్జనాలు వద్దు
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి



వినాయక చవితి వేడుకలపై సమీక్షిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా : తిరుపతి నగరంలో ఈ ఏడాది ఆధ్యాత్మిక చింతన రగిలించేలా వినాయక చవితి వేడుకలు నిర్వహించనున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్, టీటీడీ, తుడా, పోలీసు, ఫైర్, ఎలక్ట్రికల్ తదితర శాఖల అధికారులు, వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక వాతావరణంలో వినాయక చవితి వేడుకలు, నిమజ్జన మహోత్సవం జరుపుకునేలా టీటీడీ సంపూర్ణ సహకారం అందిస్తుందని చెప్పారు. తిరుమల వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ సేవ జరిగే సెప్టెంబరు 22వ తేదీన వినాయక నిమజ్జనాలు జరగకుండా కమిటీ ప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగేందుకు గతంలో కంటే మెరుగ్గా టీటీడీ అవసరమైన ఏర్పాట్లు చేస్తుందన్నారు. వినాయక సాగర్ వద్ద భక్తులందరికీ తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవా రి కుంకుమ, కంకణాలు అందజేస్తామని చెప్పారు. వినాయక చవితి సందర్భంగా వినాయక సాగర్ వద్ద టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నగర పాలక సంస్థ ఈ సారి కూడా అధికారికంగా వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తుందన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం పోలీస్, తుడా, రెవెన్యూ, ఎస్పీడీసీఎల్ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. సమావేశంలో మేయర్ శిరీష, కమిషనర్ హరిత, ఉప మేయర్ ముద్ర నారాయణ, ఆర్డీవో కనక నరసారెడ్డి, టీటీడీ ఎస్‌ఈ సత్యనారాయణ, అదనపు ఎస్పీ కులశేఖర్, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్సీ మునికృష్ణ, మాంగాటి గోపాలరెడ్డి, గుండాల గోపీనాథ్ పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా కొండారెడ్డి

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ చిన్నగొట్టిగల్లు మండల అధ్యక్షుడిగా వై.కొండారెడ్డిని నియమించినట్లు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 23 మందితో పార్టీ మండల కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా రఫీ, మల్లికార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా సుబ్రమణ్యం, రఘునాథరెడ్డి, మహేంద్రరెడ్డి, మునిశేఖర్ రెడ్డి, కార్యదర్శులుగా నిరంజన్‌బాబు, షేక్ ఫయాజ్, అర్జున్‌కుమార్, సహదేవ్, మునిచంద్ర, రాధాకృష్ణయ్య, రెడ్డిశేఖర్‌రెడ్డి, రెడ్డికృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా రఘునాథ్‌రెడ్డి, గిరిబాబు, సురేష్‌రెడ్డి, వెంకటరమణ, రెడ్డెప్పరెడ్డి, చాంద్‌బాషా, లోకనాథరెడ్డి, రామ్మూర్తి నియమితులయ్యారు.

అనుబంధ సంఘాల అధ్యక్షులు వీరే

వైఎస్సార్‌సీపీ చిన్నగొట్టిగల్లు మండల అనుబంధ సంఘాల మండల అధ్యక్షుల నియామకం సైతం పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రకటించారు. సేవాదళ్-మునిరెడ్డి, యువజన విభాగం-వై.శేఖర్, మైనారిటీ సెల్-మహమ్మద్ సుహైల్, ఎస్టీ సెల్-పి.కిరణ్, ఎస్సీ సెల్-డి.గిరి, ప్రచార విభాగం-ప్రవీణ్‌కుమార్, చేనేత విభాగం-సుబ్రమణ్యం, రైతు విభాగం-సి.భయ్యారెడ్డి, సాంస్కృతిక విభాగం-వి.హరి, మహిళా విభాగం-కళావతి, విద్యార్థి విభాగం-హరినాథ్, బీసీ సెల్-శ్రీనివాసులు, క్రిస్టియన్ మైనారిటీ- టి.శైలేష్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లికానుక పంపిణీ



రామచంద్రాపురంలో..



మంగళంలో..

రామచంద్రాపురం/తిరుపతి మంగళం: రామచంద్రాపురం మండలం సొరకాయలపాలెం పంచాయతీ పూజా వారిపల్లికి చెందిన యామిని, తిరుపతి మంగళం సప్తగిరి కాలనీకి చెందిన సౌజన్యకు పెళ్లి నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని శుక్రవారం వైఎస్సార్‌సీపీ నేతలు అందజేశారు.

గడప గడపలో నీరాజనం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి శుక్రవారం తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో గడప గడపలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి స్థానికులను ఆత్మీయంగా పలకరించారు. జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. నాలుగేళ్లుగా జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి పనులు యథావిధిగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో తన బిడ్డను ఎమ్మెల్యేగా ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె కొంతమందికి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, ఉపసర్పంచ్ పరంధామరెడ్డి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు చెంచుమోహన్ యాదవ్, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు జానకిరామరెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

చేసిన మేలును గుర్తించి ఆశీర్వదించండి



గ్రామస్తులకు పథకాలు వివరిస్తున్న హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన మంచిని గుర్తించి వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోరారు. ఆయన శుక్రవారం మండుటెండను సైతం లెక్కచేయకుండా మండలంలోని నెత్తకుప్పం పంచాయతీలోని ఎల్విపురం, వేపకుప్పం, కొత్తవేపకుప్పం గ్రామాల్లో గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ రాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్సీపురం ఇన్‌చార్జి గణపతి నాయుడు, సుధాకర్‌రెడ్డి, సర్పంచి హిమాల్‌రెడ్డి, ఎంపీటీసీలు మునీంద్రబాబు, రాజేష్, చంద్రబాబు, గోపీచౌదరీ, పుష్పకాంత్‌రెడ్డి, మురళి, బీకిరెడ్డి, రామిరెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా మహాభారత ఉత్సవాలు

రామచంద్రాపురం: ఎస్‌ఆర్ కమ్మపల్లి సమీపంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం భాగవతారిణి సీతాలక్ష్మి పాండవులు, కౌరవుల జననం హరికథను ఆలపించారు. తిమ్మరాజుపల్లికి చెందిన దేగల మునెయ్య కుటుంబసభ్యులు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు పాల్గొన్నారు.

శిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం

తిరుపతి కల్చరల్: పల్లివీధిలోని శిరిడీ సాయిబాబా ఆలయం 18వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ గౌరవాధ్యక్షుడు ఎం.సునీల్ చక్రవర్తి, కార్పొరేటర్ నరసింహ, ఆలయ కమిటీ సభ్యులు సతీష్, కిరణ్, శ్రీనివాసులు, నారాయణ, అర్చకులు కాశీ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా నాగమణి



తిరుపతి రూరల్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా చిగురువాడ ఉత్తర కండ్రిగ పాఠశాల ఎస్‌జీటీ కసిరెడ్డి నాగమణి ఎంపికయ్యారు. ఈనెల 5న వైజాగ్ ఆంధ్రా వర్సిటీలో నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

వైభవంగా మాతమ్మ కొలువు



సారె తీసుకెళుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి మంగళం : మంగళం పరిధిలోని మిట్టగాంధీపురం గ్రామంలో శుక్రవారం మాతమ్మ కొలువు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మంగళం డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల్లో తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొని అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం మాతమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళం డివిజన్ అధ్యక్షుడు ప్రళయకావేరి నారాయణరెడ్డి, తిరుమలనగర్ పంచాయతీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుండ్రాజు శివశంకర్‌రాజు, మంగళం పంచాయతీ అధ్యక్షుడు చిలమంద హరికృష్ణ, ఉపసర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, ఎంపీటీసీ లక్ష్మయ్య, గ్రామపెద్ద గురవయ్య, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు జి.బాబు, వార్డు సభ్యులు అశోక్, దయాకర్, రాంబాబు, గుండ్రాజు వంశీ, చంద్రబాబు, బాబు, తుంటి సుధాయాదవ్, మల్లెల నాగరాజు, మణి పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన



ఓటరు వెరిఫికేషన్ చేస్తున్న కలెక్టర్ వెంకటరమణా రెడ్డి

చంద్రగిరి/పాకాల/భాకరాపేట : జిల్లాలో ఓటరు వెరిఫికేషన్‌ను పక్కాగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఆర్డీఓ కనకనరసారెడ్డితో కలిసి చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2022 జనవరి 6 నుంచి మార్చి 3వ తేదీ వరకు ఓటరు పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన, చిరునామాలు మారిన, డబుల్ ఎంట్రీలు, వివాహమైన వారి ఓట్లను తొలగింపును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో దొంగ ఓట్లకు ఆస్కారం లేకుండా చేయడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేస్తున్నట్లు చెప్పారు. చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై అలిమేలు మంగమ్మ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు శ్రీకృష్ణ ముఖమండపం కల్యాణం, ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం తిరుచ్చిపై ఊరేగించారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఎస్పీకి ఆహ్వానం



తిరుపతి కల్చరల్: ఇస్కాన్ మందిరంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డికి ఇస్కాన్ మందిర్ ప్రతినిధులు ఆహ్వానం పలికారు. ఇస్కాన్ మందిరం కార్యదర్శి, పీఆర్‌వో లీలాపారాయణదాస్, ప్రతినిధులు రాధాకృష్ణ ప్రసాద్, నారాయణప్రభు శుక్రవారం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవు

తిరుపతి తుడా : నగరంలో పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను హెచ్చరించారు. ఆమె శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా అనేక ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపాలు కనిపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ విధులకు హాజరుకాని సిబ్బందిని తొలగించి కొత్త వారిని నియమించుకోవాలని హెల్త్ ఆఫీసర్‌కు సూచించారు. అనంతరం తిరుపతిలోని ప్రధాన కూడళ్లలోని డివైడర్ల సుందరీకరణ పనులను పరిశీలించారు.

ఉత్తమ విద్యార్థులుగా రాణించాలి

తిరుపతి తుడా : ఉత్తమ విద్యార్థులుగా రాణిస్తేనే ఉన్నత వైద్యులుగా చరిత్రలో నిలిచిపోయే అవకాశం ఉంటుందని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ తెలిపారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందిన విద్యార్థులకు శుక్రవారం తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్వీ మెడికల్ కళాశాలకు ఘన చరిత్ర ఉందని, ఇక్కడ సీట్లు సాధించడం వరంగా భావించాలన్నారు. సీనియర్లను ఆదర్శంగా తీసుకుని రాణించాలన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు వసుంధరదేవి, వెంకటేశ్వర్లు, బయోకెమిస్ట్రీ విభాగం అధిపతి మాధవీలత, అనాటమీ విభాగాధిపతి మురళీధర్, ఫహీమ్ పాల్గొన్నారు.

బీసీ సెల్ మండల అధ్యక్షుడు మధుబాబుకి సత్కారం



పాకాల : వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమితులైన మధుబాబుని శుక్రవారం గాంధీనగర్, కరీంతుల్లాబాద్, గుట్టకింద ఇండ్లు, కొత్త ఇండ్లు, బాలాజీ కాలనీకి చెందిన నాయకులు ఘనంగా సత్కరించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎన్నడూ మరచిపోరని, అండగా ఉంటారని హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి పదవికి ఎంపిక చేసిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. చలపతి, చంద్రశేఖర్, సురేంద్ర, రాజా, వెంకీ, మురళీకృష్ణ, నిత్యానందం, ఆంథోని, సురేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ మొహిద్దీన్ బాషాను శుక్రవారం అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఆయన ఎస్వీ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్ల కోటాలో పాలకమండలి సభ్యులుగా నియమితులయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైలులో చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

తిరుపతి క్రైం : రైళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసినట్లు రైల్వే జీఆర్పీఎఫ్ సీఐ హేమ సుందర్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టగా తమిళనాడు వేలూరు జిల్లా కట్టపారక చెందిన షణ్ముగం వెంకటేష్ అనుమానాస్పదంగా కనిపించాడన్నారు. అదుపులోకి తీసుకుని విచారిస్తే 5 నెలల క్రితం నర్సాపూర్–ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైల్లో చోరీకి పాల్పడినట్లు తెలిసిందని వెల్లడించారు. నిందితుడి నుంచి 170 గ్రాములు బంగారం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని వివరించారు.